న్యూస్ బాక్స్

షీటీంపై అవగాహన

కోల్‌సిటీటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు సోమవారం షీటీంపై సభ్యులు అవగాహన కల్పించారు. షీటీం సభ్యురాలు స్నేహలత షీటీం పనితీరును వివరించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. బస్టాండ్‌లు, ప్రధాన చౌరస్తాలు, కాలేజీ ఏరియాల్లో షీటీంల నిఘా ఉంటుందని తెలిపారు. గుర్తు తెలియని ఫోన్ కాల్స్‌కు బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వవద్దని సూచించారు. షీటీంకు ఫిర్యాదు చేయాల్సిన వారు 6303923700 నంబర్‌ను, సైబర్ మోసానికి గురైన బాధితులు 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని స్నేహలత సూచించారు. షీటీం సభ్యుడు సురేష్, హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయంలో లక్ష దీపోత్సవం

కళ్యాణ్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా గోదావరిఖని మార్కండేయకాలనీలోని శివాలయంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు లక్ష దిపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మార్కండేయ శివాలయం ట్రస్ట్ బోర్డు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంచికట్ల బిక్షపతి ఒక ప్రటనలో తెలిపారు. ఐదు రోజుల పాటు లక్ష దీపారాధన మహోత్సవాన్ని, 15న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజు పార్వతి పరమేశ్వరుల పల్లకిసేవ ఉంటుందని తెలిపారు.

- 2,023 డబుల్ బెడ్ రూముల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం
- 1,502 ఇళ్లు పూర్తి, 74 ఇళ్లలో గృహప్రవేశాలు
- అర్ధాంతరంగా నిలిచిన 525 ఇళ్లు
- మౌలిక వసతులు కల్పిస్తే 1,410 మందికి ప్రయోజనం
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై 'ఆంధ్రజ్యోతి' విజిట్



కాల్వశ్రీరాంపూర్‌లో పూర్తయిన ఇళ్లు

సుల్తానాబాద్‌లో అర్ధాంతరంగా నిలిచిన ఇళ్లు

నెరవేరని సొంతింటి కల

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేరడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు నేటికీ కూడా పూర్తి కాలేదు. కొన్ని ఇళ్లు పూర్తి కాగా, మరికొన్ని ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పూర్తయిన ఇళ్లకు విద్యుత్, నీటివసతి సౌకర్యం కల్పించేందుకు కూడా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా కనీస సౌకర్యాలు కల్పిస్తే కొన్ని ఇళ్లయినా అందుబాటులోకి రానున్నాయి. డబుల్ బెడ్ రూముల ఇళ్ల స్థితిగతులపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ నిర్వహించింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు దఫాలుగా పెద్దపల్లి జిల్లాకు మూడు వేలకు పైగా ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి 5.04 లక్షల రూపాయలు మంజూరు చేయగా, కనీస వసతుల కోసం లక్షా 25 రూపాయలు మంజూరు చేసింది. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, అంతర్గాం, మంథని, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, పాలకుర్తి మండలాల్లో 2023 ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అలాగే మార్గదర్శకాలను అనుసరించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. 2023 ఇళ్ల నిర్మాణాలకు గాను 1,502 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మంథని పోచమ్మ వాడలో 92 ఇళ్లు పూర్తి కాగా, గత ప్రభుత్వ హయాంలోనే 74 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించగా వారు గృహ ప్రవేశం చేశారు. ఇంకా 18 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. 525 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. వీటికి దాదాపు 120 కోట్ల రూపాయలకు పైగా వెచ్చించారు. 1,410 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో అవి పూర్తికావడం లేదు. పెద్దపల్లి పట్టణంలో పూర్తిచేసిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తున్నారు.

అలాగే కాల్వశ్రీరాంపూర్, ఓదెలలో నిర్మించిన ఇళ్లకు కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తే పేదలకు ఇళ్లు దక్కనున్నాయి. రామగుండం, గోదావరిఖని, అంతర్గాం, పుట్నూర్‌లో చేపట్టిన ఇళ్లను కూడా అక్కడి ఎమ్మెల్యే చొరవ తీసుకుంటే లబ్ధిదారులకు నీడ లభించనున్నది. గత ప్రభుత్వం పట్టించుకోకపోయినా ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవతీసుకుని పూర్తయిన ఇళ్ల ఆవాసాల్లో మౌలిక వసతులు కల్పించి ఇళ్లు కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

- పెద్దపల్లి పట్టణానికి సంబంధించి కూనారం రోడ్డులో, చందపల్లిలో మొత్తం

మిగతా 8వ పేజీలో...



ధర్మారంలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

ఎంపీడీవో శ్రీనివాస్

8



సీపీఆర్ చేస్తున్న 108 సిబ్బంది

సీపీఆర్ చేసి యువకుడి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

8

'ప్రజావాణి'కి 35 దరఖాస్తులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి సోమవారం 35 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ప్రజావాణి అర్జీలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంల్లో కలెక్టర్ అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్‌లో ఉంచకుండా, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. రెవిన్యూ సమ్యలపై 16, ఇతర దరఖాస్తులు 19 మొత్తం 35 దరఖాస్తులు స్వీకరించామని కలెక్టర్ పేర్కొన్నారు. పట్టణంలోని తెనుగువాడకు చెందిన ఈర్ల రమ తనకు ఈర్ల సాగర్‌కు వివాహం జరిగిందని, తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, కొడుకు కావాలని భర్త, అత్త నిత్యం వేధించేవారని, తనను కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. సఖి కేంద్రం ద్వారా సమస్యలను పరిష్కారించాలని జిల్లా సంక్షేమ అధికారికి కలెక్టర్ సూచించారు. మంథని మండలం సూర్యపల్లి గ్రామానికి చెందిన సురేష్ వారధి సొసైటీ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. గోదావరిఖని విఠల్ నగర్‌కు చెందిన వీరారెడ్డి తనకు కంటి చూపు లేదని, సదరం క్యాంప్ నుంచి వంద శాతం కంటి చూపు లేనట్లు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థలో వివిధ పథకాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, పనులు మొదలు పెట్టి జాప్యం చేయవద్దని రామగుండం ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. సోమవారం రామగుండం కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక ఆరో డివిజన్ పరిధిలోని సప్తగిరికాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన అరుణశ్రీ అనంతరం రాజీవ్ రహదారి పక్కన మెడికల్ కళాశాల వద్ద మంచినీటి పైప్‌లైన్ల లీకేజీలను పరిశీలించారు. కాశిపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు నుంచి గౌతమినగర్ సెంట్రల్ లైటింగ్, మార్కండేయకాలనీలో నాలా పనులను తనిఖీ చేశారు. దుర్గానగర్‌లో పూర్తయిన సీసీ రోడ్లను చూశారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేయాలని, ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల పనులు చేసిన తరువాత సీసీ రోడ్ల పనులు చేస్తే ప్యాచ్‌వర్క్ లేకుండా ఉంటుందన్నారు. ప్రజలకు కూడా ఇబ్బందులు కలగవన్నారు. ముందు సీసీ రోడ్డు వేసి తరువాత రోడ్లు పగులగొట్టకుండా చూడాలన్నారు. ఈ తనిఖీల్లో కార్పొరేషన్ ఈఈ రామన్, డీఈ జమీల్ అహ్మద్, ఏఈ షోయం మీర్ పాల్గొన్నారు.

14న పెద్దపల్లి 'దిశ' సమావేశం

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆర్ రవీందర్

పెద్దపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పెద్దపల్లి జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నవంబర్ 14న మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆర్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చైర్మన్‌గా జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశం 14 వ తేదీన జరుగుతుందన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గ్రంథాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయాల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని ఎంపీ వంశీకృష్ణను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఎంపీ వంశీకృష్ణను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి గురించి చర్చించి అందుకు సహకరించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు సజ్జద్, మార్కెట్ కమిటీ డైరక్టర్ కందునూరి పోచాలు ఉన్నారు.



ఎంపీని సత్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

పత్తి క్వింటాలుకు రూ. 6,949

పెద్దపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు పత్తికి అత్యధికంగా 6,949 రూపాయల ధర పలికింది. ఈ సీజన్‌లో మార్కెట్‌లో అత్యధిక ధర పలకడం ఇదే ప్రథమం. సోమవారం మార్కెట్‌కు 274 మంది రైతులు 1,021 సంచుల్లో 1123.1 క్వింటాళ్ల పత్తి తీసుకురాగా వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటాలు పత్తికి అత్యధికంగా 6,949 రూపాయలు పలకగా, అత్యల్పంగా 6,022 ధర పలికింది. మోడల్ ధర 6,751 రూపాయలుగా ఉంది.

విద్య ద్వారానే పేదరికం నుంచి విముక్తి

- అదనపు కలెక్టర్ డి వేణు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే పేదరికం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని అదనపు కలెక్టర్ డి వేణు అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ బాధ్యతలు స్వీకరించారన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని అన్నివర్గాల ప్రజలు చదువుకోవాలని ఆశయంతో కులమత బేధాలు లేకుండా పనిచేశారని అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించిన ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డు అందజేసి గౌరవించిందని పేర్కొన్నారు. పేదరికం విద్యతో మాత్రమే దూరమవుతుందని భావించి ప్రతి పేదవాడికి విద్య అందే దిశగా చర్యలు తీసుకున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మైనారిటీ బాలికల విద్యపై దృష్టి సారించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇక్కడ అన్ని కులాలు వర్గాల వారు కలిసి చదువుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీలో విలీనగ్రామమైన పూసాలలోని భక్తమార్కండేయ ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతిదేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వ్రతాల్లో కూర్చున్న దంపతులకు స్వామి వారి ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వల్స నీలయ్య, నల్ల శంకర్, భాస్కర్, కిషన్, రాజమౌళి, లింగమూర్తి, వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ధాన్యం కొనుగోళ్లను సజావుగా జరపాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



కాపులపల్లిలో, పాలితంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తూ వివరాలు సేకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టర్ శ్రీహర్ష పెద్దపల్లి మండలంలో సోమవారం విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి, గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, కాసులపల్లి, పాలితం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పక్కగా చేయాలన్నారు. ప్రతీ కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలని, ఏ ఒక్క కుటుంబం కూడా మిస్ కావడానికి వీల్లేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతీరోజు 15 కుటుంబాల వివరాలు సేకరించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్ల ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని రైతులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి ఎం శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అహ్మద్ బాషా, లక్ష్మణ్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించాలి

- సీపీ శ్రీనివాస్ - షీ టీమ్ పోస్టర్ ఆవిష్కరణ

కోల్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు వారి పిల్లలకు సమయం కేటాయించాలని, సమాజంలోని మంచీచెడుల గురించి అర్థమయ్యేలా వారికి వివరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ చేసి జారీ చేసిన షీ టీమ్ పోస్టర్‌ను సీపీ శ్రీనివాస్ సోమవారం కమిషనరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఎవరైనా సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులకు, లైంగిక వేధింపులకు గురైనా, బ్లాక్ మెయిల్ చేసినా, పని చేస్తున్న ప్రదేశంలో వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినా వెంటనే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. పనిచేసే ప్రదేశాల్లో స్వేచ్ఛగా, సురక్షితంగా పనిచేయడం ఒక మహిళ ఉద్యోగి హక్కు అని, పిల్లల విద్యార్థినుల యువతుల, మహిళల రక్షణే ప్రధాన లక్ష్యమన్నారు. ఇబ్బందికి గురైతే వెంటనే డయల్ 100, స్థానిక పోలీస్ అధికారులను, రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు రోజు కాసేపు పిల్లలతో మాట్లాడాలన్నారు. సరదాగా సమయం కేటాయించాలని, సమాజంలోని మంచి చెడుల గురించి అర్థమయ్యే లా వారికి వివరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల జోన్ సిటీ ఇన్‌చార్జి ఎస్ఐ హైమ, పెద్దపెల్లి మంచిర్యాల జోన్ పరిధి షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు శుభాకాంక్షలు తెలిపిన సీపీ

రామగుండం పోలీస్ కమిషనర్ పరిధిలో పనిచేస్తున్న 1996బ్యాచ్‌లో ఎంపికైన ఏఆర్ ఏసీపీ ప్రతాప్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ 28 సంవత్సరాల పోలీస్ సర్వీస్ పూర్తయిన సందర్భంగా సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ అధికారులతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విధులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాస్

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన వీరగోని అనిల్ అనే వ్యక్తి తన భార్యపై చేయి చేసుకోగా ఆ విషయాన్ని బాధితురాలు తన తల్లితండ్రులకు చెప్పుకుంది. బాదితురాలి తండ్రి, సోదరులు కాట్నపల్లి చేరుకుని ఈ విషయమై అనిల్‌ను ప్రశ్నించగా అనిల్ తన మామ, బావమరిదిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుల పిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సోమవారం అనిల్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం పట్టుకున్నామని ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా మట్టి తరిస్తున్న టిప్పర్ పట్టుబడిందని, కరీంనగర్ జిల్లా చొప్పదండి ప్రాంతం నుంచి మట్టిని కాట్నపల్లి వైపు మట్టిని తరలిస్తున్నారన్నారు. టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించామని ఎస్ తెలిపారు.

జ్వరంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ఓదెల నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఎలువాక శారద (35) సోమవారం జ్వరంతో మృతి చెందింది. పిట్టల ఎల్లయ్యపల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించే శారదకు పది రోజుల క్రితం తీవ్రజ్వరం రావడంతో కరీంనగర్ లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

కారు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం మొలంగూర్ బీసీ కాలనీలో బైక్‌ను కారు ఢీ కొన్న ఘటనలో చింతలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన మునిగంటి అయిలయ్య బైక్‌పై వెళుతుండా మొలంగూర్ బీసీ కాలనీ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో అయిలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ధర్మపురిలో చోరీ

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ రోడ్ సమీపంలో ఎలిగేటి లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టి లోనికి ప్రవేశించారు. అనంతరం ఇంటిలో గల ఆరుతులాల బంగారు ఆభరణాలు, రూ 20వేలు నగదు అపహరించారు. జగిత్యాల నుంచి చేరుకున్న క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. బాధితుడు లక్ష్మణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చుట్టూ పచ్చని చెట్లు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం. ఎత్తైన కొండ మీద సోమేశ్వర దేవాలయం. ఇవన్నీ భక్తులను కట్టిపడేస్తున్నాయి. చుట్టు పక్కల ప్రాంతాలే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా స్వామి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. శ్రావణ, కార్తీక మాసాల్లో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. కానీ భక్తులకు కనీస సౌకర్యాలు మాత్రం కరువు అనే చెప్పాలి. స్వామి వారు ఎత్తైన గుట్టపైన ఉండడంతో భక్తులు ఎక్కేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. ఘాట్ రోడ్డు నిర్మాణం చేపడుతామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అది అమల్లోకి మాత్రం రావడం లేదు. దీంతో భక్తుల కాష్టాలు అలానే కొనసాగుతున్నాయి.



మల్లాపూర్ సోమేశ్వరకొండ ఆలయంలో భక్తులు(ఫైల్)

ప్రకృతి అందాల మధ్య.. సోమేశ్వర గుట్ట

- నిత్యం వేల సంఖ్యలో భక్తుల రాక..
- ఘాట్ రోడ్డు సౌకర్యం లేక భక్తుల ఇక్కట్లు



మల్లాపూర్ సోమేశ్వరకొండపైకి మెట్ల గుండా వెళ్లుతున్న భక్తులు

మల్లాపూర్, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండమీద ప్రకృతి అందాల మధ్య ఉన్న కనక సోమేశ్వర స్వామి భక్తులను ఆకట్టుకున్నాడు. కోరిన కోరికలు తీర్చే స్వామిగా,పురాతన పుణ్యక్షేత్రంగా కొండపై ఆలయ నిర్మాణం చేపట్టారు. ప్రతి ఏటా శివరాత్రి, కార్తీక, శ్రవాణ మాసాల్లో సమయంలో దేవాలయంలో ఘనంగా జరిగే ఉత్సవాలకు పలు జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన కొండపైకి చేరుకుంటారు. ముఖ్యంగా కార్తీక మాసంలో ఎక్కువగా శివుడికి దీపాలు వెలిగించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు భక్తులు. అయితే ఇంత మంది భక్తులు వస్తున్నా వారికి కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. కొండపైన ఉన్న స్వామి వద్దకు వేళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడం గమనార్హం. మట్టి రోడ్డు గుండా భక్తులు కొండ పైకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా వేయిస్తామని చెప్పి స్వామి వారిని దర్శించుకుంటారు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడమే కానీ గెలిచిన తరువాత ఇచ్చిన హామీలు మాత్రం నెరవేర్చడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అధికారులు రోడ్డు నిర్మాణం కోసం అంచనా అంటూ తూతూ మంత్రంగా పరిశీలన చేస్తుంటారే గానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు.

నిధులు మంజూరైనా..

అసెంబ్లీ ఎన్నికల ముందుకు టీటీడీ డైరెక్టర్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆలయ అభివృద్ధి పనుల కోసం పది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరై సంవత్సరం గడుస్తున్నా ఘాట్ రోడ్డు నిర్మాణం మాత్రం జరగలేదు. నిధులు మంజూరు కావడం ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనుల ప్రారంభోత్సవానికి వేసిన శిలాఫలకం వరకే ఆగిపోయింది. ఆ తరువాత కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ఇకదాని ఊసే లేకుండా పోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు దృష్టి సారించి ఆలయ ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..



స్వామి దర్శనం కోసం కొండపైకి వస్తుంటాము. ముఖ్యంగా శ్రావణ, కార్తీక మాసంలో బ్రహ్మ మూర్తంలో స్వామి వారిని దర్శించుకుంటాము. కుటుంబ సభ్యులంతా కలిసి వస్తాము. కానీ ఇంతగా భక్తులు వస్తున్నా సౌకర్యాలు మాత్రం అందుకు తగ్గట్టుగా లేవు. కొంగపైకి ఎక్కేందుకు భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వయసు పైబడిన వారు కొండపైకి ఎక్కలేకపోతున్నారు. ఇబ్బందులు లేకుండా రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

\- ర్యాగేళ్ల మనీషా, మొగిలిపేట భక్తురాలు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆలయానికి ఘాటు రోడ్డు నిర్మాణం. చేపట్టాలి. కోరిన కోరికలు తీర్చే అతి పురాతన ఆలయంగా ఏళ్ల క్రితం వెలిసినప్పటి స్వామి వారి దర్శనం కోసం ఇతర జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

\- శివ శ్రీనివాస్, మల్లాపూర్ భక్తుడు

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం

- వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేటీఆర్ కాంగ్రెస్ బీసీలకు ఏం చేసిందని ప్రశ్నించారని, అసలు బీసీల గురించి మాట్లాడే అర్హత ఉందా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. కేటీఆర్ బీసీల గురించి మాట్లాడాలంటే ఆ పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి, ప్రతిపక్ష పదవులను బీసీ, ఎస్సీలకు ఇవ్వాలన్నారు. ఒక్కటి ఇచ్చినా మాట్లాడే అర్హత ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారని, కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. ఆ వివరాల కోసం విచారణ చేయిస్తామని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న ఈ కుల సర్వే దేశ వ్యాప్తంగా జరగాలని డిమాండ్ వస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ సర్వేను అక్కడక్కడ అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతీ తెలంగాణ పౌరుడు సహకరించాలన్నారు. సర్వే ఇబ్బంది పెట్టేందుకు, బలహీన వర్గాలకు మాత్రమే పరిమితమైంది కాదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక దిక్సూచి అవసరాల కోసం తీసుకుంటున్న సమాచారమని స్పష్టం చేశారు. ఎన్యూమరేటర్లకు సవచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వాఖ్యలకు ప్రభావితం కావద్దని కోరారు. అంతకుముందు రాజన్న ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ పూలమొక్కతో స్వాగతం పలికారు. కాగా పోలీసులు ఏర్పాటు చేసిన గౌరవవందనాన్ని స్వీకరించారు. సోమవారం తెల్లవారు జామున రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గంభీరావుపేటలో గంగపుత్రుల రాస్తారోకో



గంభీరావుపేటలో రాస్తారోకో చేస్తున్న గంగపుత్రులు

గంభీరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద సోమవారం రాత్రి గంగపుత్రులు రాస్తారోకో చేపట్టారు. చేప పిల్లలు పంపిణీ చేస్తామని మత్స్యశాఖ అధికారులు లింగన్నపేట సెంటర్‌కు రమ్మని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. గతంలో ఈ సమయానికి మానేరులో, చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేశామని, ఈ ఏడు చేప పిల్లలు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. లింగన్నపేట సెంటర్ వద్ద పొద్దంతా తిండి తిప్పలు లేక ఉంటే, చేప పిల్లలు ఇవ్వకుండా తిరిగి పొమ్మనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గంటల తరబడి ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో పోలీస్‌లు అక్కడకి చేరుకుని గంగపుత్రులను సముదాయించారు.

మాజీ సర్పంచుల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన మాజీ సర్పంచులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రికత్తకు దారి తీసింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుతంగా నెల రోజులు రిలే దీక్షలు, ఆందోళనలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మాజీ సర్పంచులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. 2019 నుంచి 2024 వరకు ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఫ్లకార్డులు ప్రదర్శించారు.

రగుడు జంక్షన్ నుంచి ర్యాలీగా తరలి రావడంతో కలెక్టరేట్ ఎదుట పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్‌ను కలుస్తామంటూ దూసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. వినిపించుకోకుండా కలెక్టరేట్‌లోకి పరుగు తీయడంతో పోలీసులు గేట్‌లను మూసివేశారు. ఆగ్రహించిన మాజీ సర్పంచ్‌లు అక్కడే బైఠాయించారు. డీఎస్పీ చంద్ర శేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతుండగానే కొందరు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని మాజీ సర్పంచ్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లను పోలీసు వాహనాలల్లో కలెక్టరేట్‌లోకి తీసుకురాగా వారు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అంజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో రైతు వేదికలు, శశ్మాన వాటికలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, మిషన్‌భగీరథ పనులు, సీసీరోడ్లు, మురికికాలువలతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు రాలేదని, వాటికోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షులు గణప శివజ్యోతి, చాకలి రమేష్, బొజ్జం మల్లేశం, కోల నర్సయ్య, వంశీకృష్ణరావు, గున్నాల లక్ష్మణ్, చల్లనారాయణ, బూర్గుల నందయ్య, పొన్నాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

- కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లుల కోసం ఆందోళనలు చేస్తుండడంతో పోలీసులు గేట్లను మూసివేశారు. కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా అధికారులతో పాటు ప్రజలను అనుమతించకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన అనంతరం జిల్లా అధికారుల ఐడీ కార్డులను చూసి పంపించారు. దీంతో అధికారులతోపాటు ప్రజలు గంటల తరబడి నిరీక్షించారు.

క్రైం కార్నర్

తండ్రి కడసారి చూపు కోసం..

- ఐదు రోజులుగా ఫ్రీజర్‌లోనే కూతురు మృతదేహం
- బెయిల్ ఇవ్వని కోర్టు

సారంగాపూర్, నవంబరు. 11 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లా రేచిపల్లి గ్రామానికి చెందిన పోగుల రాజేశం మల్లీశ్వరి కూతురు లత అనుమానాస్పద స్థితిలో నిర్మల్ జిల్లా, దస్తురాబాద్ మండలం, రేగోజీపేట గ్రామంలో ఐదు రోజుల క్రితం మృతి చెందగా ఆమె మృతదేహం తండ్రి కడసారి చూపు కోసం ఫ్రీజర్‌లోనే ఉంచారు. లత గత శుక్రవారం అత్తింట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. లత తండ్రి రాజేశం 9నెలలుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మావోయిస్టులకు సహకరిస్తున్నాడనే అనుమానంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. రాజేశం విడుదల కోసం పౌరహక్కుల నేతలు మాదన కుమారస్వామి, సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి అక్కడి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా ఎన్ఐఏ కోర్టు బెయిల్ మంజూరు చేయక పోవడంతో భార్య మల్లీశ్వరి పుట్టెడు దుఖంతో తిరుగు ప్రయాణం అయ్యారు. మంగళవారం లత అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

వీర్నపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంతో బాధపడుతున్న గిరి జనుడు వ్యవసాయ మోటారు వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామపరిధి కేలోత్ తండాలో ఆదివారం అర్ధ రాత్రి చోటు చేసుకున్న సంఘటన వివ రాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అజ్మీరా రెడ్డి (57) ఆదివారం రాత్రి తన సోదరుడి పొలం వద్ద ఉన్న స్టార్టర్ ఆఫ్ చేయడానికి వెళ్లాడు. స్టార్టర్ ఆఫ్ చేస్తుండగా అక్కడ పైకి తేలి ఉన్న సోలార్ విద్యుత్ తీగలకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికు లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆసు పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అజ్మీరారెడ్డి మానసిక స్థితి సరిగా లేక సోదరుడు రమేష్‌తో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. రమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో చెలరేగిన మంటలు



మంటలు చల్లార్చుతున్న అగ్నిమాపక సిబ్బంది

జమ్మికుంట రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల మురుగన్ ఇండస్ట్రీస్ (జిన్నింగ్ మిల్లు)లో సోమవారం మంటలు చెలరేగాయి. జిన్నింగ్ చేస్తుండగా యంత్రంలో వచ్చిన చిన్న రాయి వల్ల నిప్పు రవ్వలు ఏర్పడి పత్తిపై పడి మంటలు వ్యాపించాయి. గమనించిన మిల్లు నిర్వాహకులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మిల్లులో పని చేస్తున్న కార్మికులు నీళ్ల చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక కేంద్రం మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఎనిమిది లక్షల విలువ గల పత్తి కాలిపోయిందని మిల్లు యాజమాని బచ్చు భాస్కర్ తెలిపారు.

కార్గిల్ లేక్‌లో దూకి కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన పల్లె ఆంజనేయులు (50) అనే భవన నిర్మాణ కార్మికుడి కార్గిల్ లేక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 9న ఇంట్లో నుంచి వెళ్లిన ఆంజనేయులు సోమవారం కార్గిల్‌లేక్‌లో శవమై తేలాడు. నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కార్గిల్ లేక్ గట్టు వద్ద మృతుడికి సంబంధిచిన టిఫిన్ బాక్స్ మృతుడి జేబులో ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందిన చీటీ ఆధారంగా ఆంజనేయులుగా గుర్తించారు. ఆంజనేయులు వేములవాడలో భవన నిర్మాణ రంగంలో ఇసుక మోసే పని చేస్తాడు. అతడి భార్య 20 నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి సంతానం లేదు. ఒంటరి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడని ఆంజనేయులు సోదరుడు సాయిలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

పొలాల్లో అగ్నిప్రమాదం



కాలిపోయిన వరి పొలం

శంకరపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజాపూర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పంటించడంతో మంటలు కొయ్యని పొలాల్లోకి వ్యాపించి పంట కాలిపోయింది. బాధిత రైతు చింతిరెడ్డి మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఆ మంటలు సమీపంలో ఉన్న కోతకు వచ్చిన మల్లారెడ్డి పదెకరాల పొలంలోకి వ్యాపించి కొంత వరి పైరు దగ్ధమయింది. మల్లారెడ్డి సమాచారం తెలుసుకుని అప్రమత్తమై మంటలు ఆర్పివేశాడు. దీంతో కొంతమేర నష్టం వాటిల్లింది. వరి కొయ్యలకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత మల్లారెడ్డి కోరారు.

తండ్రిని హత్య చేసిన తనయుడి అరెస్టు

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో తనయుడు తొట్ల తిరుపతి యాదవ్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు అతన్ని రిమాండ్ చేయగా కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్‌కు చెందిన తొట్ల మధునయ్య(71) మధురమ్మ దంపతులకు ఒక కొడుకు తిరుపతితో పాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. సింగరేణి కార్మికుడిగా పని చేసిన మధురయ్య 13 సంవత్సరాల క్రితం పదవీవిరమణ పొందారు. మధునయ్య పేరిట ఉన్న ఐదెకరాల పదమూడు గుంటల భూమిలో కొడుకు తిరుపతి, కోడలు పేరిట తలా రెండెకరాల భూమిని వారికి రిజిష్ట్రేషన్ చేయించాడు. మిగిలిన ఒక ఎకరం పదమూడు గుంటల భూమితో పాటు మొత్తం భూమిని కొడుకు కోడలు సాగు చేసుకుంటున్నారు. అయితే మధనయ్య వద్ద ఉన్న పదమూడు గుంటల భూమిని తన కూతుళ్లకు ఇద్దామని మధునయ్య మధురమ్మ దంపతులు నిర్ణయించి ఈ విషయాన్ని తన కొడుకు తిరుపతికి చెప్పారు. దానికి తిరుపతి ఒప్పుకోలేదు. ఈ విషయంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా గొడవ కాగా తిరుపతి తన తండ్రి మధునయ్యను కొట్టి చంపాడని ఎస్ఐ వివరించారు. మృతుడు మధునయ్య భార్య ఫిర్యాదు మేరకు తిరుపతి యాదవ్‌పై హత్య కేసు నమోదు చేసి అతడిని సోమవారం అరెస్టు చేశామన్నారు. కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించడంతో అతన్ని జైలుకు తరలించామని తెలిపారు.

ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్

ఉషు పోటీలకు స్పందన

● 150 మంది క్రీడాకారుల హాజరు



ఉషు పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 11: జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఉషు పోటీలకు విశేషస్పందన లభించింది. ఈ పోటీలకు ఉమ్మడి కరీంనగర్‌లోని రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉషు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపు సుశాంక్‌రెడ్డి, బార విద్యా సాగర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉషు క్రీడతో విద్యా ర్థులలో శారీరక పటుత్వం పెరుగుతుందన్నారు. క్రీడలతో వివిధ ప్రాంతాల విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం బాలబాలికలకు వివిధ కేటగిరీల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు ఫండస్ పాఠశాల యాజమాన్యం అందించిన బహుమతులను జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమి వ్యవస్థాపకులు వికాస్, ఉషు కోచ్ విక్రమ్ గాంధీ, మహేష్, ముఫాజిల్, అఖిల పాల్గొన్నారు.

'మైటా' ఉత్సవాలకు మంత్రి శ్రీధర్‌బాబు



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మలేసియా తెలంగాణ తెలుగు అసోసియేషన్ (మైటా) ఆధ్వర్యంలో మలేసియాలోని కౌలలాంపూర్‌లో మూడురోజుల పాటు జరిగిన మైటా దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, త్రిపుర రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ హాజరయ్యారు. కరీంనగర్ జిల్లాకు చెందిన రెండు తెలుగు రాష్ట్రాల అల్గి ప్రతినిధి ఉప్పుల అంజనీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. మైటా అధ్యక్షుడు సైదా తిరుపతి, ఆర్గనైజర్ శివంగుల రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళా ప్రదర్శనలు నిర్వహించారని అంజనీప్రసాద్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించి గురుకులాల ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మానకొండూర్ మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో సోమవారం జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, ప్రభుత్వానికి పేరు తీసురావాలని సూచించారు. జోన్ లెవల్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని ఆయన తెలిపారు. అంతకు ముందు జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంయుక్త కార్యదర్శి అనంతలక్ష్మి, తహసీల్దార్ బి రాజేశ్వరి, ఎంఈవో మధుసూదనాచారి, ప్రిన్సిపాల్స్ గోలి జగన్నాథం, లచ్చయ్య, అశోక్‌బాబు, జి అశోక్‌రెడ్డి, వాసు, ఇసాక్, శివప్రసాద్, శేఖర్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు చెందిన 1,190 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కన్నవారిని విస్మరిస్తే శిక్షార్హులే..

● వృద్ధులకు అండగా పలు చట్టాలు



రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబం కోసం జీవితాన్ని ధారపోశారు. సమాజం కోసం సర్వశక్తులు ఒడ్డారు. జీవిత చరమాంకంలో ఎన్నో ఛీత్కారాలు కష్టనష్టాలు అనుభవిస్తున్నారు. వృద్ధులు వారికి ఉండే హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన లేక పోవడంతో పలువురు తమ సమస్యల పరిష్కారం కోసం ఠాణామెట్లు ఎక్కుతున్నారు. వృద్ధులకు ప్రభుత్వం, పోలీసులు అందిస్తున్న చట్టాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేకకథనం.. తల్లిదండ్రుల పోషణను విస్మరిస్తే వారిని శిక్షించేందుకు చట్టాలు ఉన్నాయి. వృద్ధులను పట్టించుకోకుంటే వారికి చట్టం అండగా ఉంటుంది. చట్టం పరిధిలో వారికున్న హక్కులు ఏంటో తెలుసుకుందాం..

● వేధింపుల నుంచి రక్షణ కోసం జాతీయ వయోశ్రీ యోజన..

వృద్ధుల్లో 50 శాతానికి పైగా వేధింపులకు గురవుతున్నట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం వృద్ధుల కోసం పలు చట్టాలు రూపొందించింది. కుమారులు, కోడళ్ల ఇతర బంధువుల దూషణలు, చిత్రహింసలతో ఇబ్బంది పడేవారి కోసం జాతీయ వయోశ్రీ యోజన పేరిట పథకాన్ని ప్రవేశపెట్టింది. వృద్ధుల్లో అధికశాతం వైకల్యాలు ఇతర వ్యాధులతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారే ఉన్నారు. మలిదశలో ఆసరాగా నిలవాల్సిన పిల్లలు కన్నవారిని ఆశ్రమాలు, ఇతర చోట్లలో చేరుస్తున్న ఘటనలు కోకొల్లలు. దీంతో వృద్ధులకు ఒంటరితనం శాపంగా మారింది. సామాజిక భద్రత పథకాలు వారికి ఉపయోగపడటం లేదు. అందుకే మన దేశంలో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ కోసం 2007లో కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, పెద్దల పోషణ కోసం సంక్షేమ చట్టం తెచ్చినా దీనిని అమలు చేయడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉంది.

● ప్రభుత్వ నుంచి ఇచ్చే రక్షణలు

1999 జనవరి 13 జాతీయ వృద్ధుల పాలసీని ప్రభుత్వం ఆమోదించింది. సంక్షేమ చర్యలను వేగవంతం చేయడానికి వృద్ధులకు ప్రయోజనం కలిగించడంలో సాధికారికత కల్పించడానికి ఏర్పాటు చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి భద్రత కల్పించడానికి పెన్షన్ ఫండ్ ఏర్పాటు, వృద్ధుల కోం వసతి గృహాలు, సంరక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తోంది. సెక్షన్ 88-బి-88 డి, 88-డి, డిబి ఆదాయ పన్ను చట్టం ప్రకారం వృద్ధులకు పన్ను తగ్గింపు ఉంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వృద్ధుల ప్రయోజనం కోసం అనేక పథకాలు అందిస్తోంది. జీవనధార యోజన, జీవన్ అక్షయ్ యోజన, సీనియర్ సిటిజన్ యూనిట్ యోజనా, మెడికల్ ఇన్సూరెన్స్ అందిస్తోంది.

● సీనియర్ సిటిజన్ మెయింటనెన్స్ చట్టం

ఇది 2007లో అమలైంది. ఈచట్టం ప్రకారం వయోవృద్ధుల రక్షణతోపాటు నెలసరి జీవన భృతి అందిస్తారు.. దీనికి ఆర్డీవో మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తారు. బాధితులు ఆర్డీవోకు ఫిర్యాదు చేసుకుంటే వారి కుమారులవద్ద నుంచి జీవనభృతి కల్పించే అవకాశం ఉంది. అడప్షన్ మెయింటనెన్స్ చట్టం 1956లో అమల్లోకి తెచ్చారు. ఈ చట్టం ప్రకారం సెక్షన్30 కింద కుమారులు, కూతుళ్లకు సైతం వర్తిస్తుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చట్టం కింద 1973 సెక్షన్ 125 సీఆర్‌పీసీ ప్రకారం కోర్టులో కేసు వేసుకునే అవకాశం ఉంది. బాధితుల కుమారులు, కూతుళ్ల ఆర్థిక స్థోమత బట్టి వారినుంచి జీవనభృతి కల్పించే విధంగా చట్టాలు చెబుతున్నాయి. డెయోస్టిక్ వాలంటిన్స్ చట్టం ప్రకారం సైతం వృద్ధులకు కోర్టులో కేసు వేసుకునే వీలుంది.



జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



పార్థు

కోల్‌సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామ గుండం పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ కుమా రుడు టి పార్థుశ్రీకృష్ణ జాతీయస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. తేజస్ డిఫెన్స్ అకా డమీ కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ గేమ్స్‌లో అర్చరీ అండర్-19 కాంపౌండ్ బోలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. నవంబరు 14 నుంచి 16 వరకు గుజరాత్‌లోని నడియాడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పార్థు ఎంపికయ్యాడు. తన కుమారుడు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఉత్తమ ప్రదర్శన చేసి దేశం తరఫున కూడా ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటు న్నట్టు ప్రవీణ్‌కుమార్, కోచ్ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్‌యూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కిషోర్



ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవి ద్యాలయం పరిపాలన విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా వై.కిషోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన శాతవాహన ఫార్మసీ కళాశాలలో విధులు నిర్వహించారు. విధుల్లో చేరిన అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు పలువురు అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అసమానతలకు వ్యతిరేకంగా రంగవల్లి పోరాటం



అభివాదం చేస్తున్న విమలక్క, ప్రొఫెసర్ కాసీం తదితరులు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప మహిళరంగవల్లి అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రంగవల్లి వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రంగవల్లి విజ్ఞాన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటు చేశారన్నారు. ఆదివాసీ బిడ్డలకు అండగా నిలిచారని గుర్తు చేశారు.

ప్రజల పక్షాన పోరాడిన వీర వనిత రంగవల్లి

గొప్ప కుటుంబంలో పుట్టి ప్రజల పక్షాన పోరాటం చేసిన వీర వనిత రంగవల్లి అని ఉస్మానియ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం అన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడిన ప్రతీ ఒక్కరు అమరత్వం పొందారన్నారు. సాయుధ పోరాటంలో ఉద్యమించిన రంగవల్లిని ఎన్‌కౌంటర్ చేయడం హేయమైన చర్యన్నారు. పోలీసులు పట్టుకున్న తరువాత కోర్టు ఎదుట ఉంచి వారు చేసిన నేరాన్ని విచారించాలని, కానీ ఇద్దరు పురుషులను, మహిళలను ఎన్‌కౌంటర్ చేసి రాజకీయ వాతావరణాన్ని సృష్టించారని గుర్తు చేశారు.

రంగవల్లి నేటి తరానికి స్ఫూర్తిదాయకం

భూస్వామ్య, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన విప్లవ కెరటం రంగవల్లి అని, ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో భాగంగా ఆమె మాట్లాడారు. నందికమాన్ చౌరస్తాలో అమరుల జ్ఞాపకార్థం స్థూపాన్ని నిర్మించాలని అనుకున్నామని, కొన్ని కారణలతో జరగలేదని అన్నారు. సమాజానికి జ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతోనే విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మున్సిపల్ చైర్‌పర్సన్ మాధ వి, స్థానిక కౌన్సిలర్ కళ్యాణి, ప్రముఖ న్యాయవాది భగవంతరెడ్డి ఉన్నారు.

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

● సుమారు 80 వేల మంది భక్తుల రాక



భక్తులతో కిటకిటలాడుతున్న రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. కార్తీక సోమవారం సందర్భంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయం కిటకిటలాడింది. ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించిన భక్తులు అనంతరం పార్వతీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు క్యూలైన్‌లోని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు ఐదుగంటల సమయం పట్టింది. సోమవారం సుమారు 80 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్తీక సందడి

ధర్మపురి, కోటిలింగాలలో గోదావరి హారతి

వేములవాడ, కొండగట్టులో ప్రత్యేక పూజలు, దీపోత్సవం

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో రెండవ సోమవారం కార్తీక సందడి నెలకొంది. లక్ష్మీ నృసింహ స్వామి, అను బంధ శ్రీ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శేషప్ప కళా వేదికపై శృంగేరి ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపెల్లి సంతోష్‌శర్మ కార్తీక మాసం గురించి సోమవారం పురాణ ప్రవచనం చేశారు.

పదో రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మ పురి వద్ద గోదావరి హారతి పదో రోజు సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, బొజ్జ రమేష్‌శర్మ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ అర్చకులు తెలిపారు. అర్చకులు నాగ రాజు శర్మ, సంజీవ్ శర్మ భక్తులు పాల్గొన్నారు. సోమవారం సందర్భంగా శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు.

వేములవాడలో సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. ఆలయంలోని కళావేదిక ప్రాంగణంలో సోమవారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపాలను వెలిగించారు. ధర్మపురికి చెందిన నరహరి శాస్త్రీయ సంగీతం భక్తులను ఆకట్టుకుంది. అర్చకులు రాజేశ్వర శర్మ, దుమాల నాగరాజు శర్మ, వెంకటయ్య, ఏఈవో జయకుమారి, సూపరింటెండెంట్ పూజిత, తిరుపతిరావు, పీఆర్వో అశోక్ తదితరులు ఉన్నారు.



రాజన్న ఆలయంలో సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివారం దేవతలకు అర్చనలు చేపట్టారు. రాత్రి ఆలయ అద్దాల మండపం వద్ద లింగాకరంలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు.

కొండగట్టులో కార్తీక దీపోత్సవం

మల్యాల, (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తికదీపోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులతో కలిసి ఆగమ పాఠశాల విద్యార్థులు కార్తిక దీపాలు వెలిగించారు. పర్యవేక్షకులు చంద్రశేఖర్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.









ధర్మపురిలో భక్తుల పవిత్ర స్నానాలు, గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు, కోటిలింగాల, కొండగట్టులో పూజలు, వేములవాడలో మహాలింగార్చన

నెరవేరని సొంతింటి కల

(5వ పేజీ తరువాయి)

484 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అవి పూర్తి కాగా, నీటి వసతి, విద్యుత్‌, రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి డ్రా ద్వారా ఇళ్లను కేటాయించారు. డిసెంబరు, జనవరి నెలల్లో గృహప్రవేశాలు చేసే అవకాశాలు ఉన్నాయి.



మంథనిలో అర్ధాంతరంగా నిలిచి పోయిన ఇళ్ల నిర్మాణం

● రామగుండం పట్టణంలోని ఐదో డివిజన్‌ జంగాలపల్లిలో 670 ఇళ్లకు గాను 670 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 480 ఇళ్లు పూర్తి కాగా, 56 ఇళ్లు ప్లాస్టింగ్‌ దశలో, 34 ఇళ్లు గోడల దశలో ఉన్నాయి. 100 ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. లబ్ధిదారుల ఎంపిక జరిగినప్పటికీ ఇళ్లను కేటాయించలేదు.

● గోదావరిఖనిలో 160 ఇళ్లకు గాను 81 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. కొన్ని పిల్లర్లు, కొన్ని స్లాబ్‌ దశలో నిలిచిపోయాయి. ఇప్పటి వరకు వీటిపై కోటి 80 లక్షల రూపాయలు వెచ్చించారు.

● అంతర్గాం మండలానికి 360 ఇళ్లు మంజూరు కాగా, 60 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. గోలివాడ, అంతర్గాం, పెద్దంపేట్‌ గ్రామాలకు చెందిన లబ్ధిదారులను గతంలో ఎంపిక చేసినప్పటికీ, చిన్నచిన్న మైనర్‌ పనులు నడుస్తున్నందున ఇంకా ఎవరికి కేటాయించలేదు.

● మంథని మున్సిపాలిటీ, మండలానికి 329 ఇళ్లు మంజూరు కాగా, 237 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో పోచమ్మవాడలో 92 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. 74 మంది లబ్ధిదారులకు కేటాయించడంతో గృహప్రవేశం చేశారు. ఇంకా 18 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. కూచిరాజ్‌పల్లిలో 120, కాకర్లపల్లిలో 25 ఇళ్లు స్లాబ్‌ లెవెల్‌ ఆగిపోయాయి.

● కాల్వశ్రీరాంపూర్‌ మండల కేంద్రంలో 240 ఇళ్లు నిర్మించారు. వీటికి విద్యుత్‌, నీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. 180 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, 60 ఇళ్లకు ఎంపిక చేయాల్సి ఉంది.

● సుల్తానాబాద్‌ పట్టణంలో 80 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేశారు. కొన్ని స్లాబ్‌ దశలో, మరికొన్ని ఇళ్లు పిల్లర్ల దశలో ఆరేళ్ల క్రితం నిలిచిపోయాయి. లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఇళ్ల నిర్మాణాలు జరగడం లేదు

● ఓదెల మండల కేంద్రంలో 146 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇవి పూర్తికాగా, వీటికి విద్యుత్‌, నీటి సౌకర్యం కల్పించడంతో పాటు తలుపులు బిగించాల్సి ఉంది. లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఇంకా ఎంపిక చేయలేదు. అయినా కొందరు అక్కడ నివాసం ఉంటున్నారు.

● ధర్మారం మండలం బొట్లవనపర్తి గ్రామంలో 15 ఇళ్ల నిర్మాణాలు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి.

● పాలకుర్తి మండలం పుట్నూర్‌కు 19 ఇళ్లు మంజూరు కాగా, 10 ఇళ్లు జీ ప్లస్‌ 2 నిర్మాణాలు చేపట్టి మధ్యలో పనులను నిలిపి వేశారు. స్లాబ్‌ లెవెల్‌, గోడల నిర్మాణాలు పూర్తయ్యాయి.

● కమాన్‌పూర్‌, రామగిరి, జూలపల్లి, ధర్మారం మండలాల్లో డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు.

● ఇళ్లను వెంటనే పూర్తి చేయాలి..

- అంబటి లావణ్య, కూచిరాజ్‌పల్లి



కూచిరాజ్‌పల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం ప్రారంభించిన డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు స్లాబ్‌ లెవెల్‌ వరకు పూర్తయ్యా యి. మిగతా పనిని పూర్తిచేసేలా చర్యలు తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి.

● మౌలిక వసతులు కల్పించాలి..

- ఆసంశెట్టి కృష్ణ, ఓదెల



ఓదెలలో నిర్మించిన డబుల్‌ బెడ్‌ ఇళ్లను స్థానికులకు కేటాయించి నీడ కల్పించాలి. ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ, విద్యుత్‌ సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పించడంలో, తలుపులు బిగించడంలో జాప్యం చేస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే చొరవ తీసుకుని కావాల్సిన నిధులు మంజూరు చేయించి మౌలిక వసతుల పనులు పూర్తి చేయించి అర్హులైన నిరుపేదలకు ఇళ్లను కేటాయించాలి.

బాధితుల వద్దకే నేరుగా వచ్చి..



గోదావరిఖని ఫైవింక్లయిన్‌కాలనీకి చెందిన పెద్ద లక్ష్మయ్య తన ఇద్దరు కొడుకులు తనని పట్టించు కోవడం లేదని, తన కాలు బాగాలేనందున ఆఫీస్‌ లోపలికి రావడం లేదని తెలుసుకున్న ఏసీపీ మడత రమేష్‌ నేరుగా బాధితుడి దగ్గరకి వచ్చి వారి సమస్య విన్నారు. పిటిషన్‌ తీసుకొని అక్కడిక్కడికే వారి కొడుకులతో మాట్లాడారు. కౌన్సెలింగ్‌ కోసం పిలిచారు. ప్రస్తుత వైద్య ఖర్చుల కోసం రూ.1000 అందచేశారు. - కోల్‌సిటీ

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

- టీపీటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య

పెద్దపల్లి కల్చరల్‌ , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై టీపీటీఎఫ్‌ రాజీలేని పోరాటం చేస్తోందని తెలంగాణ ప్రోగ్రెసివ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ని జిల్లా టీపీటీఎఫ్‌ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని పలు ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా చింతకుంట్ల పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా బండి పెళ్లి పరుశరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య వ్యవహరించారు. పరిశీలకులుగా మాడుగుల రాములు, సీనియర్‌ కార్యకర్త ఉద్యమ నాయకుడు కోల రాజమల్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఓదెల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు నిర్వహించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనాథ్‌ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గుండ్లపల్లి, కనగర్తి, ఓదెల, కొలనూర్‌, మడక, నాంసానిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శ్రీనాథ్‌ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్‌ ఇన్‌చార్జీలు మరియు ఏఈవోలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. 41 కేజీల కంటే ఎక్కువ ధాన్యం తూకం చేయొద్దని సూచించారు. సమన్వయం చేసుకుంటూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్‌, ఏఈవోలు అనిల్‌, సంధ్య, రాకేష్‌, సెంటర్‌ ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్ల పంపిణీ

సుల్తానాబాద్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌ విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్లు, లైబ్రరీ పుస్తకాలు, డెస్క్‌ టాప్‌ కంప్యూటర్లను, రెండు బీరువాలను, ఒక జిరాక్స్‌ ప్రింటర్‌ను బెస్ట్‌ రన్నర్స్‌ ఆర్గనైజేషన్‌ వారు సోమవారం పంపిణీ చేశారు. సుల్తానాబాద్‌ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్‌ హౌజింగ్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ కోలేటి దామోదర్‌ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర్‌ మాట్లాడుతూ బెస్ట్‌ రన్నర్స్‌ ఆర్గనైజేషన్‌ వారు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నార న్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల కోసం లక్షన్నర రూపాయల విలువ గల వస్తువులు అందివ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుకు కోలేటి సతీష్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అయిల రమేష్‌, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి అల్లెంకి లింగమూర్తి, అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్‌, శివాలయం చైర్మన్‌ అల్లెంకి సత్యనారాయణ, హెచ్‌ఎం శారద, వాసవి క్లబ్‌ రీజియన్‌ కార్యదర్శి బాదం వాణి, సుమ తదితరులు పాల్గొన్నారు

అంతర్గాం (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు సోమవారం బెస్ట్‌ రన్నర్‌ అసోసియేషన్‌ వారు రూ.2లక్షల విలువ చేసే ప్రింటర్స్‌, కుర్చీలు, ఇతర ఫర్నీచర్‌ అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ కోలేటి దామోదర్‌ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

పెద్దపల్లి రూరల్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా సర్వే చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ అన్నారు. సోమవారం మండలం లోని దేవునిపల్లి, అందుగులపల్లి గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్‌ పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు చేస్తున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారం అందించాలని ఎంపీడీవో ప్రజలకు సూచించారు. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 21 వేల40 కుటుంబాలు ఉండగా వరకు 4,682 కుటుంబాలు సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. వారి వెంట ఎంపీవో ఫయాజ్‌, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



ఎలిగేడులో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మారం (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగ ఎన్యూమరేటర్స్‌కు ఎదురవుతున్న పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. సర్వేలో భాగంగా సోమవారం ధర్మారం కొత్తూరు, చామనపల్లి, కొత్తపల్లిన్యూ గ్రామాల్లో డీపీవో వీరబుచ్చయ్యతో పాటు ఎంపీడీవో ఐనాల ప్రవీణ్‌ కుమార్‌, ఎంపీవో కె రమేష్‌, మండల వ్యవసాయ అధికారి బండ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా 12 గ్రామాల్లో సోమవారం ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి మొదటి రోజు 336, రెండోరోజు 796, మూడవరోజు 1048, మొత్తం 2180సర్వే చేశారు. కాగా ఎలిగేడు, నర్సాపూర్‌ గ్రామాల్లో మత్స్యశాఖ అధికారి రమేష్‌బాబు, తహసీల్దార్‌ బషీరొద్దీన్‌, ఎంపీడీవో భాస్కర్‌రావు సర్వేను పరిశీలించారు. ప్రతిరోజు మీకు కేటాయించి 15 కుటుంబాల వివరాలు సేకరించాలని ఆయన ఆదేశించారు.

సుల్తానాబాద్‌ (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌ మండలంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఈ నెల 9న ప్రారంభమైన సర్వే వార్డులో వారీ గా గ్రామాల వారీగా నిర్వహిస్తున్నారు. ఈ సర్వే కోసం గ్రామాల్లో 108 మంది ఎన్యూమరేటర్లను నియమించామని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. మండలంలోని 27 గ్రామాల్లో స్టిక్కరింగ్‌ పూర్తయిందని, మొత్తం 15 వేల 524 కుటుంబాలను గుర్తిం చామన్నారు. మూడు రోజుల్లో ఇప్పటి వరకు 2303 గృహాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. ప్రతీ ఎన్యూమరేటర్‌ రోజు 12 నుంచి 15 గృహాలను సర్వే చేస్తున్నా రని వివరించారు. సర్వేకు సహకరించాలని ప్రజలను కోరారు.

మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

పెద్దపల్లి టౌన్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓ క్వారీలో మృతి చెందిన వలస కార్మికుడి కుటుంబానికి 30 లక్షల రూపాయల నష్టపరిహారం ఇప్పించాలని, కుటుంబంలో ఒకరికి ఉపాధి కోసం ఉద్యోగం కల్పించాలని దళిత బహుజన లేబర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బొంకూరి కైలాసం డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి జిల్లా లేబర్‌ అధికారికి వినతిపత్రం అందజేశారు. వలస కార్మికులకు కార్మిక రక్షణ చట్టాలు అమలు చేయాలని కోరారు. తక్షణమే చర్యలు చేపట్టి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అలువాల ప్రశాంత్‌, కండె కరుణాకర్‌, అలువాల శంకరయ్య పాల్గొన్నారు.

గాలికుంటు టీకాల పంపిణీ

ఎలిగేడు, నవంబర్‌ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్‌లో సోమవారం పశుగణాభివృద్ధి సంస్థ శాఖ ఆధ్వర్యంలో 302 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 15 గర్భకోశవ్యాధి చికిత్సలు, మూడు కృత్రిమ గర్భధారణ, 52 నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు ఝాన్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్‌ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, గోపాలమిత్రలు జానీ, సమ్మయ్య, శంకర్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌ బాక్స్‌

రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌ పరిధిలో అక్రమంగా ప్రధాన నాలాను కుదించి దానిపై భవన నిర్మాణాన్ని చేపట్టిన బార్‌ అండ్‌ రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్‌) నాయకులు సోమవారం రామగుండం ఇన్‌చార్జి కమిషనర్‌ అరుణశ్రీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎఫ్‌సీఐ, ప్రజల అవసరాల రీత్యా వ్యర్థాలను వదలడానికి పారిశ్రామిక ప్రాంతంలో ప్రవహిస్తున్న ప్రధాన నాలా 30 నుంచి 40 ఫీట్లు వెడల్పు ఉండేదని, ఈ ప్రధాన నాలాను బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ నిర్మించడానికి ఐదు నుంచి 10 ఫీట్లకు కుదించి ఎలాంటి సెట్‌ బ్యాక్‌ వదలకుండా భవనాన్ని నిర్మించారన్నారు. ఇప్పటికైనా రామగుండం నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వెంటనే నాలాను వెడల్పు చేయడంతో పాటు నాలాపై నిర్మించిన భవనాన్ని తొలగించాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్‌ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐవైఎఫ్‌ నగర అధ్యక్ష, కార్యదర్శులు సాదుల శివకుమార్‌, ఆసాల నవీన్‌, రాణవేణి సుధీర్‌ కుమార్‌ ఉన్నారు.

రైతులు పాడి పెంపకంపై దృష్టి సారించాలి

ఓదెల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించాలని డాక్టర్‌ మల్లేశం సూచించారు. కరీంనగర్‌ పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్‌ రాఘవ ఆధ్వర్యంలో పిట్టల ఏల్లయ్యపల్లి గ్రామంలో కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. నట్టల నివారణ మందులను, మినరల్‌ మిక్చర్‌ పౌడర్‌ ను అందించారు. గోపాలమిత్ర ద్వారా పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు జన్మించే వీర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. దీని విలువ 600 రూపాయలు ఉంటుందని ప్రభుత్వ రాయితీపై రైతులకు 250 రూపాయలకే అందిస్తున్నా మని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు ప్రవీణ్‌, ఓదెలు, మహేశ్‌, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాలకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈర్ల శోభారాణి తెలిపారు. ప్రస్తుతం వైరల్‌ జ్వరాలు వస్తున్న తరుణంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణ్‌నగర్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కార్డియో వైద్యుడు దీక్షిత్‌ అన్నారు. సోమవారం గోదావరిఖని కృష్ణానగర్‌లో రిటైర్డ్‌ సింగరేణి కార్మికులకు కరీంనగర్‌ మెడికవర్‌ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ మధ్యకాలంలో చాలా మంది గుండెపోటుకు గురై మృతి చెందుతున్నారని, ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సుమారు 200 మందికి ఉచితంగా 2డీ ఎకో, ఈసీజీ, షుగర్‌, బీపీ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్‌ హెడ్‌ గుర్రం కిరణ్‌, మేనేజర్‌ కరుణాకర్‌, హరీష్‌ పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

సుల్తానాబాద్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోకి వచ్చే దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని అమ్ముకోవాలని సుల్తానాబాద్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మినుపాల ప్రకాష్‌రావు అన్నారు. సుల్తానాబాద్‌ మండలంలోని సాంబయ్యపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రకాష్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకుని ప్రభుత్వ మద్దతు ధరను పొం దాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌ నాయకులు మాజీ ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

ధర్మారం (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో సోమవారం ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్‌ లావుడ్యా రూప్లానాయక్‌ ప్రారంభిచారు. ఈ సందర్భంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు కాంపెల్లి రాజేశం, భూమయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్‌ కొత్త నర్సింహులు, మాజీ ఎంపీటీసీ చింతల జగన్‌ మోహన్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాంబయ్యపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రకాష్‌రావు

సీపీఆర్‌ చేసి యువకుడి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

ధర్మారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో అపస్మారక స్థితిలో పడి ఉన్న యువకుడి ప్రాణాలను 108 సిబ్బంది సీపీఆర్‌ చేసి కాపాడారు. ధర్మారం మండలం మల్లాపూర్‌ గ్రామానికి చెందిన కొడిపెల్లి సందీప్‌ ఆదివారం రాత్రి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు తూర్పారా పట్టే నిమిత్తం కరెంటు వైరు సరి చేస్తుండగా, విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకొని సందీప్‌కు సీపీఆర్‌ చేస్తూనే అంబులెన్స్‌లో ఎక్కించి చికిత్స అందించారు. దీంతో సందీప్‌ స్పృహలోకి రాగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సలహా మేరకు సోమవారం వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సందీప్‌ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఆర్‌ చేసి ప్రాణాలు కాపాడిన108 సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



తీవ్రగాయాల పాలైన సందీప్‌

ఉషు పోటీల్లో 'ఖని' విద్యార్థులకు పతకాలు



పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

కళ్యాణ్‌నగర్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9, 10న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్‌ ఉషు పోటీల్లో గోదావరిఖనికి చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్టు ఉషు పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. 30కిలోల విభాగంలో శ్రీమాన్‌ గోల్డ్‌ మెడల్‌, 27 కిలోల విభాగంలో సాయి శ్రీతిక్‌ గోల్డ్‌ మెడల్‌, సాయి విఘ్నేష్‌ బ్రాంజ్‌ మెడల్‌, 33 కిలోల విభాగంలో సిద్ధార్థ సిల్వర్‌ మెడల్‌ను సాధించినట్టు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు వచ్చే నెలలో జరిగే నేషనల్‌ ఉషు సబ్‌ జూనియర్‌ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మధుమేహంపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టులో సోమవారం సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మధు మేహంపై అవగాహన కార్యక్రమం జరిగింది. హెల్త్‌ ఆఫీసర్‌ డా. పద్మ మధుమేహ సంబంధిత వ్యాధులు, వాటికి గల కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కార్మికులకు వివరించారు. మధుమేహం, బీపీ లక్షణాలు దుష్ప్రభావాలు, నివారణ చర్యలను తెలియజేశారు. బీపీ, మధుమేహం ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం వంటివాటిని ఉద్యోగులు పాటిస్తే అనారోగ్య సమస్యలు రావని డా పద్మ అన్నారు. కార్యక్రమంలో పీవో రాజశేఖర్‌, మేనేజర్‌ ఉదయ్‌ హరిజన్‌, అధికారులు సునీల్‌ ప్రసాద్‌, ఏఐటీయూసీ పిట్‌ సెక్రెటరీ తిరుపతిరావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌

గోదావరిఖని, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరిట పాలకులు చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్నారని, వారికి న్యాయం జరిగేంతా వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో చిరు వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్‌ పరిధిలో అభివృద్ధి పేరిట ఇటీవల అధికారులు ఇష్టానుసారంగా కూల్చివేతలు చేపట్టారన్నారు. దీంతో వ్యాపారస్తులు రోడ్డున పడ్డారన్నారు. వ్యాపా రస్తులకు ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుం డా కూల్చి వేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని డిమాండ్‌ చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌

ఎన్టీపీసీ, మేడిపల్లి సెంటర్‌లో చిరువ్యాపారులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా వారి దుకణాలు కుల్చి వారి జీవితాలను రోడ్డు మీదపడేశారన్నారు.

గోదావరిఖని పట్టణంలో ఓల్డ్‌ అశోక్‌ టాకీస్‌, గాంధీ నగర్‌, హనుమాన్‌నగర్‌లలో చిరువ్యాపారుల దుకణాలను కుల్చారన్నారు. గోదావరిఖనిలో చిరువ్యాపారులకు ఎలాంటి ప్రత్యామ్నాయ చూపకుండా దుకా ణాలను కుల్చడం దారుణమన్నారు. ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఉరుకోబోమన్నారు. అధికార పక్షం ప్రతిపక్షాలపై కేసులు పెడుతూ నోరునొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. అహంకారపు పాలనను సాగిస్తున్న అధికార పార్టీని ప్రజలు బొంద పెట్టేందుకు సిద్ధం కావాలన్నారు. నిరసన దీక్షకు న్యూ ఇండియా పార్టీ నాయకులు జేవీ రాజు, వేముల అశోక్‌ సంఘీబావం తెలిపారు.

ఈ నిరసన దీక్షలో రామగుండం నగర డిప్యూటీ మేయర్‌ నడిపెల్లి అభిషేక్‌రావు, మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు పెంట రాజేష్‌, పాముకుంట్ల భాస్కర్‌, బాదే అంజలి, కల్వచర్ల కృష్ణవేణి, కుమ్మరి శ్రీనివాస్‌, గాదం విజయ, ఐత శివ కుమార్‌, జనగామ కవిత సరోజిని, మజీ వైస్‌ ఎంపీపీ మట్ట లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఎలిగేడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05బ్యాచ్‌ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ అర్షనపల్లి వెంకటేశ్వర్‌ రావు, పూర్వ విద్యార్థులు, గురువులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూసాలలో కొండచిలువ ప్రత్యక్షం

సుల్తానాబాద్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని పూసాల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం కొండచిలువ ప్రత్యక్షం కాగా గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలో పొలాలను కోసేందుకు వరికోత యంత్రం పనిచేస్తుండగా ఆ పొలాల్లో ఉన్న కొండ చిలువ బయటకు వచ్చింది. రోడ్డు పక్కన వెలుతుండడంతో పలువురు గమనించారు. కొంతమంది యువకులు దాన్ని పట్టుకుని ఇతర చోటకు తరలించేందుకు ప్రయత్నించగా సాధ్యంకాలేదు. దీంతో కొందరు కర్రలతో కొట్టగా చనిపోయిందని గ్రామస్థులు తెలిపారు.



రాక్‌ క్లైంబింగ్‌ అడ్వెంచర్‌లో పాల్గొననున్న జ్యోత్స్న

కోల్‌సిటీటౌన్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సెక్రెట్‌ హార్ట్‌ స్కూల్‌ కు చెందిన ఎన్‌సీసీ ఆఫీసర్‌ జ్యోత్స్న ఆల్‌ ఇండియా రాక్‌ క్లైంబింగ్‌ అడ్వెంచర్‌ ఎక్స్‌పేరిడేషన్‌లో పాల్గొననున్నారు. ఎన్‌సీసీ ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ తొమ్మిదో బెటాలియన్‌ కు చెందిన జ్యోత్స్న మధ్యప్రదేశ్‌ రాష్ట్రం గ్వాలియర్‌లో ఈనెల 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు జరగనున్న ఈపోటీల్లో పాల్గొన నున్నారు. అరుదైన ఘనత సాధించిన జ్యోత్స్న ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

'ఎమ్మెల్సీగా రఘువీర్‌సింగ్‌కు అవకాశం కల్పించండి'

మంథని, నవంబరు 11: కరీంనగర్‌-మెదక్‌-నిజామాబాద్‌-ఆదిలాబాద్‌ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా సర్దార్‌ రఘువీర్‌సింగ్‌కు అవకాశం కల్పించాలని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్‌ చెన్నమల్ల చైతన్య కోరారు. సోమవారం ఆయన మంథనిలో విలేకరులతో మాట్లాడుతూ.. రఘువీర్‌ సింగ్‌ గెలుపు కోసం సుందిళ్ల లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశామన్నారు.

మహాపాదయాత్రకు తరలిన మాలసంఘం నాయకులు

కాల్వశ్రీరాంపూర్‌, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ మాలమహానాడు మహాపాదయాత్రకు మండల కేంద్రం నుంచి మాలమహానాడు నాయకులు సోమవారం పెద్దపల్లికి తరలివెళ్లారు. కార్యక్రమంలో చెవుల రాజయ్య, నక్క రమేష్‌, దాసరి రాజయ్య, బైరం రాజయ్య, చిన్ని, సువర్ణ, రాధా, సౌందర్య, పాల్గొన్నారు.